కూలీల కొరత.. అన్నదాతల కలత

- గ్రామాల్లో ముమ్మరంగా వ్యవసాయ పనులు
- జోరుగా వరినాట్లు
- కూలీల కొరతతో తప్పని ఇబ్బందులు
- ఎకరాకు రూ.4,500 వెచ్చిస్తున్న వైనం
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు

రైతులను వ్యవసాయ కూలీల కొరత వేధిస్తోంది. వరినాట్లు వేసే కాలం కావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. దీంతో ఇతర రాష్ట్రాల వారిపై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. అలాగే తోటి రైతులు, స్నేహితులు, బంధువులతో పనులు చేయించుకున్న వారు కూడా ఉన్నారు.


నారుమళ్లు

పొదలకూరు: గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. డెల్టా గ్రామాలైన తాటిపర్తి, విరువూరు, మహ్మదాపురం, సూరాయపాళెం, వెలికంటిపాళెం, నేదురుమల్లిలో వరినాట్లు వేస్తున్నారు. ఈ రబీ సీజన్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురిశాయి. చెరువులు నిండకున్నా సాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశాలు తక్కువే. మండలంలో రైతాంగానికి సోమశిల దక్షిణ, నెల్లూరు, కనుపూరు, కండలేరు ఎడమగట్టు, ఒకటో నంబర్ బ్రాంచ్ కాలువలు, విరువూరు సప్లై చానల్ ద్వారా సాగునీరు అందుతుంది. ఫలితంగా రబీలో వరిసాగుకు సమస్యలు ఎదురయ్యే పరిస్థితుల్లేవు. దీంతో రైతులంతా వ్యవసాయ పనులను ముమ్మరంగా చేస్తున్నారు.

కూలీల కోసం..

మెట్ట పంటల సాగు చేపట్టిన రైతులు మినుము, పెసరలకు సోకిన తెగుళ్లకు మందులు పిచికారీ చేసుకుంటున్నారు. మరోవైపు వరినాట్లు వేసేందుకు కూలీల కోసం రైతులు వాకబు చేస్తున్నారు. దాదాపుగా జిల్లా అంతటా ఒకే సీజన్లో వ్యవసాయ పనులు మొదలు కావడంతో కూలీల కొరత ఉంది. ఫలితంగా అన్నదాతలు బంధువులు, స్నేహితులు, తోటి రైతులను పిలుచుకుంటున్నారు. తిరిగి వారి వరినాట్లు పూర్తయిన తర్వాత బదులు వెళ్తున్నారు. ఈ రబీలో మండలంలో 14 వేల ఎకరాలకు పైబడి నాట్లు పడే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు వెల్లడించారు.

వీరైతే..

ఎకరా పొలంలో నాట్లు వేసేందుకు కూలీల కోసం రూ.4,500 చెల్లించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి నాట్లు వేసేందుకు జనం పల్లెలకు వస్తున్నారు. బిహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన వారు పది ఎకరాలకు పైబడిన రైతులకు నాట్లు వేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ప్రస్తుతం తాటిపర్తి, మహ్మదాపురం, విరువూరు, సూరాయపాళెం గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు.

ఎదురుచూపులు

ఐఏబీ సమావేశం తర్వాత సోమశిల ప్రాజెక్ట్ నుంచి దక్షిణ కాలువకు సాగునీటిని విడుదల చేస్తున్నారు. అయితే చివరి ఆయకట్టులో ఉన్న నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, చేజర్ల మండలం రెడ్డివారి కండ్రిక గ్రామాలకు సక్రమంగా నీరు అందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో నీటి విడుదలను పెంచాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. దక్షిణ కాలువ 7ఆర్ ద్వారా 26, 27 ఉపకాలువల నుంచి పై గ్రామాలకు సాగునీటిని సరఫరా చేస్తారు. ప్రస్తుతం నావూరు చెరువుకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిసింది. అయితే కాలువ వెంబడి రైతులకు ఉన్న మాగాణి భూముల్లో నారుమళ్లు, వరినాట్లు వేసుకునేందుకు సమాయత్తం అవుతున్నారు. నీటి విడుదలను పెంచితే వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నదాతలు వెల్లడించారు.


వరినాట్లు వేస్తున్న కూలీలు


దక్షిణ కాలువ

సాగునీటి విడుదలను పెంచాలి



దక్షిణకాలువకు సాగునీటి విడుదలను పెంచాలి. ప్రస్తుతం వస్తున్న నీరు చివరి ఆయకట్టు వరకు సక్రమంగా సరఫరా కావడం లేదు. అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటే రైతులకు ఇబ్బందులు ఉండవు. వారంలో జుల్లో నాట్లు వేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

– ఎస్.బాలకొండారెడ్డి, రైతు, చెన్నారెడ్డిపల్లి

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ



కొడవలూరు: స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు తదితరాలను క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. పిల్లల కుర్చీలు 15, టీచర్ల కుర్చీలు నాలుగు, రెండు కార్పెట్లను ఇన్‌చార్జి సీడీపీఓ లక్ష్మీప్రసన్నకు సంస్థ ఏరియా మేనేజర్ ఫిరోజ్ చేతుల మీదుగా అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

చెత్త రిక్షాలపై నిర్లక్ష్యపు తుప్పు


ముళ్లచెట్లలో పడేసిన రిక్షాలు

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో చెత్త తరలించే వాహనాలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తుప్పుపట్టిపోతున్నాయి. గ్రామాల్లో పోగుపడే చెత్తను పంచాయతీ సిబ్బంది సేకరించాక దానిని తడి, పొడిచెత్తగా విభజించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారు. ఇందుకోసం గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు చెత్తను తరలించే రిక్షాలను పంపిణీ చేశారు. ప్రస్తుతం అవి మూలనపడి ఉన్నాయి. మనుబోలులో అయితే సచివాలయం వెనుక వైపు ఐదారు రిక్షాలను ముళ్లచెట్లలో పడేశారు. ఎండకు, వానకు అవి తుప్పుపట్టిపోతున్నాయి. ప్రస్తుతం వాటిని గాలికొదిలేయడంతో చెత్త నుంచి సంపద తయారీ సంగతి పక్కనపెడితే గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారవుతోంది. అధికారులు స్పందించి చెత్త తరలించే రిక్షాలను వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రావి ఆకుపై 'ఇందిరమ్మ'



పొదలకూరు: దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రాన్ని రావి ఆకుపై విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య గీశారు. ఈనెల 19న ఇందిరా జయంతి సందర్భంగా మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన చిత్రకారుడు పెంచలయ్య చిత్రాన్ని గీశారు.

భక్తి మార్గంలో పయనించాలి


రామలక్ష్మమ్మతో మాట్లాడుతున్న జీయర్‌స్వామి

సంగం: ప్రతిఒక్కరూ సనాతన మార్గాన్ని పాటిస్తూ భక్తిని చాటుకుని మోక్షాన్ని పొందాలని శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి అనుగ్రహ భాషణం చేశారు. మండలంలోని అమరపు నాయుడుకండ్రికలోని ల్యాంకో వృద్ధాశ్రమాన్ని సోమవారం రాత్రి జీయర్‌స్వామి సందర్శించారు. ఆశ్రమంలోని ఆంజనేయ స్వామి, శ్రీకృష్ణుడి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. కార్తీక మాసం అత్యంత ప్రీతికరమైందని, ప్రతిఒక్కరూ ఉపవాసదీక్షతో కార్తీక దీపాలు వెలిగించాలన్నారు. వృద్ధాశ్రమం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని, ఇటువంటి చోట ఆరోగ్యం దొరుకుతుందన్నారు. అనంతరం ఆశ్రమం గురించి లగడపాటి రామలక్ష్మమ్మను అడిగి తెలుసుకుని స్వగ్రామంలో వృద్ధాశ్రమం నిర్మించి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో గొప్ప విషయమన్నారు. తొలుత జీయర్ స్వామికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

అల్లూరు: ఎస్సీ, ఎస్టీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐడీ డీఎస్పీ ఎస్ కోటారెడ్డి, కావలి డీఎస్పీ శ్రీధర్ అన్నారు. సీఐడీ ఆధ్వర్యంలో అల్లూరులోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం చట్టాలపై విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించి బహుమతులను అందజేశారు. సీఐ పాపారావు, ఎస్సై కిషోర్ బాబు, ఎంపీడీఓ రజనికాంత్, కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు దాసరి పోలయ్య, ఎల్లు సాల్మాన్‌రాజు, సత్యవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల ఊసేదీ..?

పొదలకూరు: పట్టణంలో నాలుగు దశాబ్దాలుగా గ్రంథాలయం ఉంది. ఈనెల 14వ తేదీ నుంచి వారోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారు. స్థానిక లైబ్రరీలో మాత్రం కార్యక్రమాల ఊసే లేదు. గతంలో క్రమం తప్పకుండా ఇక్కడ వారోత్సవాలను వేడుకగా నిర్వహించేవారు. వక్తలను తీసుకొచ్చి గ్రంథాలయాల ఉపయోగాల గురించి విద్యార్థులు, పాఠకులకు వివరించేవారు. అయితే నేడు రెగ్యులర్ అధికారి లేకపోవడంతో సక్రమంగా వారోత్సవాలను నిర్వహించడం లేదు. చేజర్ల, పొదలకూరులకు ఒకరే అధికారి ఉండడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బుచ్చిరెడ్డిపాళెం: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు పలు పోటీలను సోమవారం నిర్వహించారు. 'స్వాతంత్య్రోద్యమంలో గ్రంథాలయాల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను ఏర్పాటు చేశారు. గ్రంథాలయాధికారి మంజులత, సాహితీవేత్త గండికోట సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు ముద్ర రుణాల మంజూరు

- చేనేత, జౌళి శాఖ సహాయ అభివృద్ధి అధికారి


రుణ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న అధికారి

పొదలకూరు: చేనేత కార్మికులకు బ్యాంకుల ద్వారా ముద్ర రుణాలను మంజూరు చేసినట్లు చేనేత, జౌళి శాఖ జిల్లా సహాయ అభివృద్ధి అధికారి ప్రసాదరావు పేర్కొన్నారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ, పుట్టాయగుంట వీధిలో సోమవారం ఆయన లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి చేనేత కార్మికుడికి రూ.50 వేల రుణం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో తమ శాఖ ద్వారా 10 శాతం సబ్సిడీని అందజేస్తామన్నారు. పొదలకూరు ప్రాంతంలో చేనేత కార్మికులకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు 97905 96503 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు.

జాతీయ విపత్తుల నిర్వహణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో జాతీయ విపత్తుల నిర్వహణ అంశంపై ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విపత్తుల సమయంలో ఏం చేయాలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం తెలిపింది. బాధితులకు కంటి భాగం, తల, కాళ్లకు గాయాలైనప్పుడు ఎలా రక్షించాలి?, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులకు సీపీఆర్ చేయడం తదితర విషయాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. సదస్సులో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం నుంచి సందీప్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు 130 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 134 మందికి గానూ 130 మంది హాజరయ్యారని వెల్లడించారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: ముత్తుకూరు మండలం నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ప్రాజెక్టు ఇంజినీర్లు సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్లో 470 మెగావాట్లు, 2వ యూనిట్లో 500 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది.

బెల్టు దుకాణంపై దాడి



కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెంలో బెల్టు దుకాణాలను నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై కోటిరెడ్డి ఆధ్వర్యంలో దాడులను సోమవారం రాత్రి చేపట్టారు. గ్రామానికి చెందిన మీరా ఇంటిపై దాడి చేసి పది క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. బెల్టు దుకాణాలను నిర్వహించడం చట్టవిరుద్ధమని, ఇలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బెల్టు దుకాణాలను ఎక్కడైనా నిర్వహిస్తుంటే, పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



కొడవలూరు: బాల్య వివాహాలతో అనర్థాలు సంభవిస్తాయని కొడవలూరు వైద్యాధికారి రామకృష్ణ పేర్కొన్నారు. బాల్య వివాహాలతో సంభవించే దుష్పరిణామాలపై మండలంలోని గువ్వగుంటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరంతో పాటు ఆడ పిల్లలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ మాట్లాడారు. బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే ఐసీడీఎస్ అధికారులకు సమాచారమివ్వాలని కోరారు. ఎమ్మెల్‌హెచ్‌పీ ప్రియాంక, ఏఎన్‌ఎం విఠలమ్మ, సర్పంచ్ సునీల్‌కుమార్, నేతలు జనార్దన్, యస్దానీబాషా, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



కొడవలూరు: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక హైస్కూల్లో వాలీబాల్, క్విజ్, చిత్రలేఖన పోటీలను కొడవలూరు గ్రంథాలయ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో హైస్కూల్, స్థానిక గురుకుల పాఠశాల జట్లు తలపడగా, జెడ్పీ హైస్కూల్ జట్టు విజేతగా నిలిచింది. పోటీలను ఎంఈఓలు వసంతకుమారి, అంకయ్య ప్రారంభించారు. గురుకుల ప్రిన్సిపల్ దేవసహాయం, గ్రంథాలయాధికారి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులను అందజేయనున్నామని గ్రంథాలయాధికారి సురేంద్రరెడ్డి తెలిపారు.

రోడ్ల పక్కనే చెత్త దిబ్బలు


నరుకూరు సెంటర్‌లో జనావాసాల మధ్య ఇలా..


తోటపల్లిగూడూరులో రోడ్డు పక్కన ఇలా..

తోటపల్లిగూడూరు: ప్రధాన రహదారుల వెంబడి చెత్త దిబ్బలు తిష్ట వేస్తుండడంతో గ్రామీణ ప్రాంతవాసులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండలంలో డంపింగ్ యార్డులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో గ్రామాల్లోని చెత్తను పంచాయతీ పాలకులు రహదారుల వెంబడి పోగు చేస్తున్నారు. కూడళ్లు, జనావాసాల మధ్యే చెత్త వేస్తున్నారు. దీంతో రహదారుల వెంబడి రాకపోకలు సాగించే వారు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. అపరిశుభ్రత వాతావరణం కారణంగా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముంది. ప్రధానంగా నరుకూరు సెంటర్, సాలిపేట సెంటర్, మహాలక్ష్మీపురం సెంటర్ల వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పాలకులు, అధికారులు స్పందించి డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేసి చెత్తను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

సీపీఎం నేతల ధర్నా



బుచ్చిరెడ్డిపాళెం: గత ప్రభుత్వ హయాంలో పంపుసెట్లకు మీటర్లు వేయించడాన్ని వ్యతిరేకించిన వారే ప్రస్తుతం వాటి ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండటం దుర్మార్గమని సీపీఎం నేతలు ఆరోపించారు. పట్టణంలోని సబ్‌స్టేషన్ వద్ద ధర్నాను సోమవారం చేపట్టిన అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రీ పెయిడ్ మీటర్లను ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ట్రూ అప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘ జిల్లా నేత శ్రీనివాసులు, సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్తీకం.. వైభోగం

మనుబోలు: కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని మహిళలు పెద్దఎత్తున శివాలయాల్లో దీపాలు వెలిగించారు. మనుబోలు శివాలయం, సంగమేశ్వరాలయాలతోపాటు పిడూరు, పిడూరుపాళెం, బద్దెవోలు, కొలనకుదురు, మడమనూరు, కుడితిపల్లి తదితర గ్రామాల్లోని శైవ క్షేత్రాలకు భక్తులతో పోటెత్తారు. మనుబోలులో అర్చకులు ఫణీంద్ర శర్మ, సాయికుమార్ శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము పటికతో శివలింగాన్ని తయారు చేశాడు.

కాటేపల్లి శివాలయంలో..

తోటపల్లిగూడూరు: మండలంలోని కాటేపల్లిలో ఉన్న పద్మావతి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో సోమవారం కార్తీక మాసం పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి దీపాలు వెలిగించారు. కాటేపల్లి సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు.

పలు ఆలయాల్లో..

పొదలకూరు: వందల ఏళ్ల చరిత్ర కలిగిన పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి (శివాలయం) దేవస్థానంలో కార్తీక మాస మూడో సోమవారం పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో ఆకాశ దీపంలో నూనెపోసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు శివాలయానికి వచ్చి దీపాలు వెలిగించారు. పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక దీప మహోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవస్థానం నిర్వాహకులు సాయంత్రం ఆకాశదీపాన్ని వెలిగించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి అత్యంత వైభవంగా శివపార్వతుల కల్యాణం జరిగింది. కార్తీక మాసంలో మూడో సోమవారం సందర్భంగా స్ఫటిక లింగేశ్వరుడికి, నర్మదా బాణ లింగాలకు ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. వేదపండితులు శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మనుబోలు: ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు


మనుబోలు: ప్రత్యేకాలంకరణలో సంగమేశ్వరుడు


తోటపల్లిగూడూరులో..


పొదలకూరులో..


స్వామి, అమ్మవార్ల కల్యాణం


కల్యాణానికి హాజరైన భక్తులు